# ఆత్మీయ వంటలు



## బేబీ కార్న్ ఫ్రై

కావలసినవి: బేబీకార్న్ 200 గ్రాములు, మైదా, మొక్కజొన్నపిండి, బియ్యప్పిండి 2 టేబుల్ స్పూన్ల చొప్పున, సోయా సాస్, కారం, మిరియాల పొడి, చెంచా చొప్పున, ఉప్పు రుచికి తగినంత, 6 టేబుల్ స్పూన్ల నూనె వేయించడానికి సరిపడా తయారీ: బేబీకార్న్ లను పొడవుగా సాగడానికి కోసుకోవాలి. ఒక వెడల్పాటి పాత్రలో మైదా, మొక్కజొన్నపిండి, బియ్యప్పిండి, కారం, ఉప్పు, మిరియాల పొడి వేసి కలపాలి. అందులో తగినన్ని నీళ్లు, సోయా సాస్లను జత వేసి.. ఉండలు కట్టకుండా మెత్తగా అయ్యేలా మళ్లీ మళ్లీ కలపాలి. అందులో బేబీ కార్న్ జోడించాలి. పిండి మరీ గట్టిగానో, జారుగానో లేకుండా చూడాలి. అప్పుడే వాటికి చక్కగా పిండి పట్టుకుంటుంది. కడాయిలో నూనె కాగిన తర్వాత.. బేబీ కార్న్ లను మెల్లగా జారవిడిచి.. తక్కువ సెగ మీద ఆరేడు నిమిషాలు వేయించాలి. మంటను పెంచి ఇంకో రెండు నిమిషాలు వేయించాలి. అవి లేత గోధుమ రంగులోకి మారాక.. పళ్లెంలోకి తీయాలి. చిల్లీ లేదా టొమాటో సాస్లో వడ్డించారంటే ఇష్టంగా తినేస్తారు. బేబీ కార్న్ ను నిలువుగా చీల్చినట్లు కోయడం వల్ల లోపలి భాగం కూడా బాగా ఉడికి ఎంతో రుచిగా ఉంటుంది.

## ఆల్మండ్ రోజ్ కుల్ఫీ



**కావలసినవి:** చిక్కటి పాలు, ఫుల్మ్ 4 కప్పుల చొప్పున, చక్కెర అర కప్పు, బాదం పప్పుల పొడి అర కప్పు, బాదం పలుకులు 2 చెంచాలు, కుంకుమపువ్వు పావు చెంచా, నెయ్యి చెంచా, ఎండిన గులాబి రేకులు పావు కప్పు **తయారీ:** బాదం పలుకులను నేతిలో వేయించి పక్కనుంచండి. పాలను పాన్లో పోసి తక్కువ సెగ మీద ఉంచి, కలియబెడుతూనే ఉండండి. అవి చిక్కబడి, సగం పరిమాణం తగ్గిన తర్వాత.. బాదం పొడి, చక్కెర వేసి ఉండలు కట్టకుండా కలపండి. పంచదార పూర్తిగా కరిగిపోయాక దించేసి.. మిశ్రమాన్ని వడకట్టండి. అందులో గులాబీ రేకులు, కుంకుమపువ్వు జోడించి అంతా కలిసేలా కలియతిప్పండి. చల్లారిన తర్వాత కుల్ఫీ అచ్చులలో లేదా చిన్న గిన్నెల్లో పోసి ఫ్రీజ్ చేయండి. కుల్ఫీని ఫ్రీజర్ లోంచి బయటకు తీసి.. వేయించిన బాదం పలుకులతో అలంక రించండి. ఆల్మండ్ రోజ్ కుల్ఫీ రుచిని ఆస్వాదించండి.

## కడాయ్ పనీర్

కావలసినవి: పనీర్ కప్పు, ఉల్లిపాయలు 2, టొమాటోలు 3, కాప్సికమ్ 1, అల్లం తరుగు టేబుల్ స్పూన్, పచ్చిమిర్చి 2, కారం ఒకటిన్నర చెంచా, ధనియాల పొడి, గరం మసాలా పొడి చెంచా చొప్పున, పసుపు పావు చెంచా, ఉప్పు రుచికి సరిపడా, కసూరీ మేథీ: 2 టేబుల్ స్పూన్లు, ధనియాలు చెంచా తయారీ: పనీర్ను ముక్కలుగా కోసి వేడి నీళ్లలో వేయండి. ఉల్లిపాయలు, టొమాటోలు, కాప్సికమ్లను సన్నగా తరగండి. కడాయిలో నూనె వేడయ్యాక.. కచ్చాపచ్చా దంచిన ధనియాలు వేయండి. అందులో అల్లం తరుగు వేసి కొన్ని క్షణాలు వేయించి.. ఉల్లి, పచ్చిమిర్చి ముక్కలు జోడించండి. అవి దొరగా వేగాక.. టొమాటో ముక్కలు, ఉప్పు, పసుపు, ధనియాల పొడి, గరం మసాలా, కారం వేసి కలియబెట్టండి. టొమాటో ముక్కలు మెత్తబడి.. నూనె తేలే వరకూ వేయించండి. తర్వాత కాప్సికమ్ ముక్కలు వేసి ఒక నిమిషం వేయించండి. మరీ ఎక్కువగా వేగకూడదు. అందులో పన్నీర్ముక్కలు, కసూరీ మేథీ, ఒక కప్పు నీళ్లు జోడించండి. మధ్య మధ్యలో కలియబెడుతూ గ్రేవీ చిక్కగా అయ్యే వరకూ ఉడికించండి. చివర్లో కొత్తిమీర తరుగు వేసి దించండి. ఘుమఘుమలాడే కడాయ్ పనీర్ తయారైపోతుంది.



# నా పరిశోధనల లక్ష్యం జై కిసాన్



ఉమా మహేశ్వరి

**చదువంటే పుస్తకాల్లోని సమాచారాన్ని వల్లె వేయడం, బోధించడమే కాదు... పరిశోధనలకూ ప్రాణం పోయాలి. ఈ మార్గాన్నే ఎంచు కున్నారు ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరి దేవి. తిరుపతి, శ్రీ పద్మావతి మహిళా వర్సిటీ అప్లైడ్ మైక్రోబయాలజీ విభాగం సీనియర్ ఆచార్యులు ఈమె తన పరిశోధన తెలుసుకుందాం..**

బోధనా రంగంలో 30 ఏళ్ల అనుభవం. మొదట్లోంచి పరిశోధనలకు ప్రాధాన్యత ఇస్తూ వచ్చా. యూజీసీ, డీబీటీ, డీఎస్టీ, ఐసీఎంఆర్, ఏపీ నెదర్లాండ్స్ బయోటెక్నాలజీ, ఎన్టీఆర్... వంటి పరిశోధనా సంస్థల ఆర్థిక సహకారంతో ఇప్పటివరకు 14 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. ప్రస్తుతం అయిదు ప్రాజెక్టుల్ని చేస్తున్నాను. వాటిలో రెండు పేఎం ఉష నిధులతో చేపడుతున్నా. యూజీసీ మిడ్ కెరియర్ గ్రౌంటూ అందుకుంది. ఇప్పటివరకూ ఏడు అంశాలకు సంబంధించి పేటెంట్లకు దరఖాస్తు చేయగా నాలుగింటికి దక్కాయి. మిగిలినవి పరిశీలనలో ఉన్నాయి. వివిధ జర్నల్స్ 120 పబ్లికేషన్లు ప్రచురితమ య్యాయి. వాటిలో అధికంగా స్కోపస్ జర్నల్లోనే వచ్చాయి. అకాడమీ ఆఫ్ ప్లాంట్ సైన్సెస్, ఇండియా(ఆప్స్) వైస్ ఛైర్పర్సంగా, రాష్ట్ర పరిశోధన బోర్డు డైరెక్టర్, ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ రాష్ట్ర నోడల్ ఆఫీసర్గా పనిచేశాను. అంతర్జాతీయ స్థాయిలో రెండు పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్లు చేశా. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి రాష్ట్ర శాస్త్రవేత్త అవార్డు, యూజీసీ నుంచి మిడ్ కెరియర్ అవార్డుతోపాటు పలు ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారు, ఈవీ పరిశోధనలు... డీఆర్డీవో నుంచి రూ.16లక్షల నిధులతో ఆర్మీ సిబ్బంది కోసం ఓ ప్రాజెక్టు జరుగుతోంది. పాలు, బ్రెడ్డు ఎక్కువ రోజులు నిలువ ఉండేలా చేయడం దీని ఉద్దేశం. దీనికోసం ఒక సహజ నూనెను అభివృద్ధి చేశా. పాత్రలో ఉన్న పాలల్లో దీన్ని వేస్తే 60 రోజులు పాడవకుండా ఉంటాయి. బ్రెడ్డు 45-60రోజుల వరకు తాజాగా ఉంటుంది. మైసూర్లోని డీఆర్డీవో రీసర్చ్ ల్యాబ్ సమన్వయంతో, వర్సిటీలోని మరో ఇద్దరు ఆచార్యులతో కలిసి ఈ ప్రాజెక్టుని మొదలు పెట్టారు. మద్యం సేవించే వారిలో కాలేయ సంబంధ వ్యాధులు ఎక్కువ. ఆహారపు అలవాట్లలో మార్పువల్ల కూడా ఈ ఫ్యాటీ లివర్ సమస్యలు వస్తాయి. గ్రీన్ టీ ఆకు, దొండకాయ, సీగ్రాస్ వెల్లుల్లి... కలిపి మందు తయారుచేశాను. నీటిలో వేసుకుని తాగితే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. దీన్నో టాబ్లెట్ రూపంలో తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నా. దీనికి పేటెంట్ను సాధించా. గాయాలు మరీ పెద్దవైనప్పుడు అక్కడి చర్మాన్ని తొలగించి వేరే చోటనుంచి తీసి ఆ స్థానంలో అమరుస్తారు. బదులుగా సముద్రంలో సహజంగా లభించే సీ వీడ్లోని రెడ్ ఆల్గేను తీసుకుని ఐంట్మెంట్ తయారుచేశా. దీన్ని పెద్ద గాయాలపై రాస్తే త్వరగా నయం అవుతుంది. దీనికి పేటెంటు దక్కింది. విత్తనాలు ఆరోగ్యంగా లేకపోతే మొలకెత్తవు. అవి ఆరోగ్యంగా ఉన్నాయా లేదా తెలుసుకునేలా ఒక కిట్ తయారు చేశా. కందులు, వేరుసెనగ, క్యాప్సికం, మిర్చి విత్తనాల ఆరోగ్యాన్ని దీని ద్వారా తెలుసుకోవచ్చు. ఈ పరిశోధనకు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ నుంచి యంగ్ సైంటిస్ట్ అవార్డు దక్కింది. పేటెంటూ పొందాను.

## పిల్లల కోసం కన్నీటి ప్రార్థన..

సీయోను కుమారి ప్రాకారమా, నదీప్రవాహమువలె దివారాత్రము కన్నీరు పారనిమ్ము విరామము కలుగనియ్యకుము నీ కంటిపాపనువిశ్రమింపనియ్యకుము. నీవు లేచి రేయి మొదటి జామున మొఱ్ఱపెట్టుము నీళ్ల కుమ్మరించునట్లు ప్రభువు సన్నిధిని నీ హృదయమునుకుమ్మరించుము నీ పసిపిల్లల ప్రాణము కొరకు నీ చేతులను ఆయన తట్టు ఎత్తుము ప్రతి వీధిమొగను ఆకలిగొని వారు మూర్ఛిల్లుచున్నారు(విలాపవాక్యములు (2: 18,19). ఇది పసిబిడ్డల గురించి, పిల్లల గురించి చెప్పబడిన వాక్యం. అవును పిల్లల గురించి ఎంతోప్రార్థించాల్సిన అవసరం మనకుంది. మన పిల్లల గురించి, ఇతర పిల్లల గురించి అంటే మన సంఘాలకు వస్తున్న పిల్లల గురించి,సమాజంలో ఉన్న మనతోటి పిల్లల గురించి కూడా ప్రార్థించాలి. ఎందుకంటే నేటి పిల్లల చుట్టూ ఎన్నో విషవలయాలు చుట్టుకుని ఉన్నాయి.



ఆధునిక గ్యాడ్జెట్లు, చదువులో పెరుగుతున్న పోటీ, మత్తుపదార్థాల ప్రలోభాలు ఇలా నిత్యం వారిని వెంటాడుతున్నాయి.ప్రత్యేకించి సెల్ఫోన్లు, కంప్యూటర్లు, ట్యాబ్ వంటివి వారికి అతిసమీపంలో ఉండడం వల్ల వారికి తెలియకుండానే పాపంలో పడిపోతున్నారు. ఏదైతే పిల్లలు చేయకూడదో వాటిని చేస్తున్నారు. తల్లిదండ్రులకు, సమాజానికి దుఃఖకరంగాను, హానికరంగామారుతున్నారు. ఈ పరిస్థితుల్లో తల్లిదండ్రులుగా, సండెస్కూల్ టీచర్లుగా పిల్లల గురించి భారంగా ప్రార్థించాల్సిన అవసరం ఉంది. ఇదిఅత్యవసరమైన పని. అంతేకాదు పిల్లలు చాలా సున్నితంగా తయారవుతున్నారు. కాస్త గట్టిగా గద్దిస్తే తీవ్రమైన నిర్ణయాలుతీసుకుంటున్నారు. తద్వారా కన్నవారికి కడుపుకోత, గుండెవేదనను మిగుల్చుతున్నారు. పిల్లలు దేవుడు మనకు అనుగ్రహించిన స్వాస్థ్యంకాబట్టి, వారిగురించి ఎంత ఎక్కువగా ప్రార్థన చేస్తే, వారి జీవితాలు ప్రభువుకోసం నిలబడతాయి. యిర్మీయా ప్రవక్త ఆనాటికాలంలోపసిపిల్లలు, వీధుల్లోని పిల్లల గురించి ఎంతో ప్రలాపించాడు. మనం కూడా చిన్నారులు దేవుడికోసం జీవించేలా భారంగా ప్రార్థిద్దాం.

**- పి.శామ్యూల్**

**అంతర్వాణి**

## నీటిలో వ్యాయామం..

**ఆక్వా ఏరోబిక్స్.. వర్కవుట్స్లో ఇప్పుడో ట్రెండ్. వ్యాయామంపై ఆసక్తి పెంచుకోవాలనుకునేవారూ, తక్కువ సమయంలో బరువు తగ్గాలనుకునే మహిళలూ..ఈ కసరత్తుల్ని ఎంచుకుని చూడండి. ఇవి ఒత్తిడిని తగ్గిస్తాయి.**

♦.నడుము లోతు నీళ్లల్లో నిటబడి మంద్రంగా వినిపించే సంగీతాన్ని ఆస్వాదిస్తూ నెమ్మదిగా వ్యాయామం చేయడమే దీని స్టైల్. ఇందుకోసం ఫిట్నెస్ సంస్థలు ప్రత్యేక తరగతులనూ ఏర్పాటు చేస్తున్నాయి. వీటికి కుటుంబ సభ్యులంతా కలిసి వెళ్లగలిగితే..అక్కడ నాణ్యమైన సమయాన్ని గడపగలుగుతారు. సరదాగా ప్రయత్నించే ఈ వర్కవుట్ సంతోషాన్నే కాదు.. తెలియకుండానే శరీరానికి తగిన శ్రమనూ అందిస్తుంది. వ్యాయామంపై ఆసక్తినీ పెంచుతుంది. ఫలితంగా హ్యాపీ హార్మోన్లు విడుదలై ఒత్తిడినీ తగ్గిస్తాయి. ♦ నీళ్లల్లో వ్యాయామం చేయడం వల్ల గ్రావిటీ, ఫ్రిక్షన్ తక్కువగా ఉంటాయి. దీంతో కీళ్ల దగ్గర ఒత్తిడి పడదు. కండరాలు దృఢంగా మారతాయి. నీటిని ముందుకీ, వెనక్కీ నెట్టడం వల్ల భుజబలం పెరుగుతుంది. ♦. ఈ ఆక్వా ఏరోబిక్స్ మంచి కార్డియో వ్యాయామం. తక్కువగా అలసిపోవడం వల్ల ఎక్కువ సమయం ఇందుకోసం కేటాయించుకోవచ్చు. దీంతో శరీరం మొత్తానికీ రక్తప్రసరణ సరిగా. జరుగుతుంది. ఊపిరితిత్తుల సామర్థ్య పెరుగుతుంది. అధికరక్తపోటు అదుపులో ఉంటుంది. ♦ వాటర్ ఏరోబిక్స్ వల్ల కెలోరీలువేగంగా ఖర్చవుతాయి. అంతేకాదు, ఈ కసరత్తులు గాయాల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మంచి నిద్రపడుతుంది.



## గిన్నెలు లేకపోతేనేం !



గ్యాస్ సిలిండర్ కొరత... వంటకు ప్రత్యామ్నా యాలను వెతికేలా చేస్తోంది. అలాంటి వాటిల్లో ఇండక్షన్ స్టవ్ ఒకటి. దీనిమీద అయస్కాంత గుణం ఉన్న పాత్రలు మాత్రమే పనిచేస్తాయి. అల్యూమినియం, రాగి, గాజు వంటి నాన్ మ్యాగ్నెటిక్వి ఈ స్టవ్ మీద వేడెక్కవు. అలాగని ఇప్పటికప్పుడు బోలెడు డబ్బులు పోసి వాటిని కొనేయక్కర్లేదు. కొన్ని మార్గాలు ఉన్నాయి. ప్రయత్నించండి. ♦ మార్కెట్లో ఇండక్షన్ అడాప్టర్ ప్లేట్ దొరుకుతుంది. దీన్ని ఇనుము. స్టెయిన్ వంటి లోహాలతో తయారు చేస్తారు. ఈ డిస్కలను ఇండక్షన్ స్టవ్ మీద పెట్టి దానిపై ఎలాంటి పాత్రనైనా పెట్టొచ్చు. మొదట ఈ అడాప్టర్ ప్లేట్ వేడెక్కి.. ఆపై ఆ సెగ గిన్నెకు బదిలీ అవుతుంది. ♦మీ దగ్గర అడాప్టర్ ప్లేట్ లేకపోయినా పరవాలేదు... అడుగు భాగం ఫ్లాట్గా ఉన్న ఇనుప పెనాన్ని ఇండక్షన్ మీద పెట్టి దాని మీద చిన్న అల్యూమినియం గిన్నెల్ని పెట్టి వేడి చేసుకోవచ్చు. ♦ పాత్ర అడుగు భాగం ఫ్లాట్గా ఉంటే దానికి సరిపోయే ఒక పల్చని స్టెయిన్లెస్ స్టీల్ ప్లేట్ను అతికించండి. అయితే, ఇది సరిగా అతుక్కోవాలి. లేదంటే వేడి ఎక్కదు. స్టవ్ కూడా పాడయ్ ముప్పు ఉంటుంది.




నిహారిక చేసే సినిమాలన్నీ మేమే డిస్ట్రిబ్యూట్ చేయాలని కోరుకుంటున్నాను

రాకాస్త బ్లాక్ బస్టర్ డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్లో

## 'రాకాస' డిస్ట్రిబ్యూటర్స్ సక్సెస్ మీట్

మైత్రి రవి ఆడియెన్స్ థియేటర్ల వరకు వచ్చి, సినిమాని చూసి, ఇంత పెద్ద హిట్ చేశారు హారిక కొణిదెల మాట్లాడుతూ .. 'రాకాస'ని చూసిన ప్రతీ ఒక్క ఆడియెన్కి పర్సనల్గా థాంక్స్ చెప్పాలని ఉంది. కానీ అది అసాధ్యం. మా డిస్ట్రిబ్యూటర్లందరూ హ్యాపీగా ఉన్నారంటే అది నిజమైన విజయం అని నాకు అనిపిస్తోంది. మైత్రి రవి మాట్లాడుతూ ... నిహారిక 'రాకాస'ని అద్భుతంగా ప్రమోట్ చేశారు. సంగీత్ శోభన్ మాట్లాడుతూ .. ముందు నుంచీ నాకు సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్. మా కోసం వచ్చిన మైత్రి కి థాంక్స్. ..బ్రహ్మాజీ మాట్లాడుతూ .... రాకాస లాంటి టీంని నేను ఇంత వరకు చూడలేదు. ఎంతో ప్యాషనేట్తో వీరంతా పని చేశారు. మానస శర్మ మాట్లాడుతూ .. మా 'రాకాస' మూవీని డిస్ట్రిబ్యూటర్లంతా కలిసి జనాల వరకు రీచ్ చేశారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ మన్యం రమేష్ మాట్లాడుతూ ... 'రాకాస' కోసం సుబ్బా రెడ్డి గారు ముందడుగు వేశారు. ఆయన వచ్చిన తరువాత చాలా మంది డిస్ట్రిబ్యూటర్లు వచ్చారు.

## 'రాక్షసపురం' ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది: కె.ఎస్. రామారావు



రాజ్ బి శెట్టి హీరోగా నటించిన కన్నడ సూపర్ హిట్ మూవీ రక్కసపురదోల్ ను తెలుగు ప్రేక్షకుల ముందుకు రాక్షసపురం టైటిల్తో తీసుకొస్తున్నారు ప్రముఖ నిర్మాత కేఎస్ రామారావు. ఈ చిత్రాన్ని కె.ఎన్. ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై కె. రవివర్మ నిర్మించారు. రవి సారంగ దర్శకత్వం వహించారు. .. ప్రముఖ నిర్మాత కె.ఎస్. రామారావు మాట్లాడుతూ .. నా కెరీర్ డబ్బింగ్ చిత్రంతోనే ప్రారంభమైంది. కమల్ హాసన్ నటించిన ఎర్రగులాబీలు చిత్రాన్ని తెలుగులో రిలీజ్ చేశాను. ఆ సినిమా ఘన విజయం సాధించింది. ఇప్పుడు కొంత విరామం తర్వాత మళ్లీ మా క్రియేటివ్ కమర్షియల్స్ బ్యానర్ పై రాక్షసపురం అనే మూవీని తెలుగు ఆడియెన్స్ ముందుకు తీసుకొ స్తున్నా. ప్రొడ్యూసర్ రవివర్మకు ఫోన్ చేసి నేను ఈ సినిమా తెలుగులో రిలీజ్ చేస్తానని చెప్పాను. ఈ చిత్రంలో హీరో రాక్షస సంహారం చేస్తుంటాడు. అది ఒక ఊరిలో జరుగు తుంటుంది. అందుకే టైటిల్ రాక్షసపురం అని పెట్టారు. నేను 86లో చిరంజీవి గారితో రాక్షసుడు అనే చిత్రాన్ని రూపొందించాను. ఆ సినిమా టైటిల్ కొందరికి నెగిటివ్గా అనిపించింది. కానీ హీరో చేసేవన్నీ మంచి పనులే, కథ మంచిదే.

## 'హారుడు' ట్రైలర్ లాంచ్



'హారుడు' మంచి కమర్షియల్ యాక్షన్ ఎంటర్టైనర్. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో హీరో వెంకట్ తెలిపారు. శ్రీ సీతా రాముల కల్యాణం చూతము రారండి, అన్నయ్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. వీఆర్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్'హారుడు. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్లో హీరో వెంకట్ మాట్లాడుతూ..'హారుడు' సినిమాను పూర్తి చేయడానికి నేను యాక్టింగ్తో పాటు ప్రొడ్యూసర్ బాధ్యతలు కూడా తీసుకోవాల్సి వచ్చింది. థాంక్యూ. డైరెక్టర్ రాజ్ తాళ్లూరి మాట్లాడుతూ.. ఇది పూర్తిగా టీమ్ వర్క్. ఈ సినిమా కోసం వెంకట్ ప్రాణం పెట్టి పనిచేశారు. ప్రవీణ్ మాట్లాడుతూ..ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. వెంకట్ గారిని లవర్ బాయ్గా చూసాం, కానీ ఇందులో చాలా డైనమిక్గా కనిపిస్తున్నారు. చంద్ర మహేష్ మాట్లాడుతూ.. ట్రైలర్ చాలా అద్భుతంగా ఉంది. రాజ్ పూరి జగన్నాథ్ గారి దగ్గర పని చేసిన మార్క్ కనిపిస్తోంది. మ్యూజిక్ డైరెక్టర్ మణి జిన్న మాట్లాడుతూ: రాజ్ గారు అద్భుతమైన విజన్తో ఈ సినిమా తీశారు. డిఓపీ ఆనంద్ మాట్లాడుతూ.. సినిమా అద్భుతంగా వచ్చింది. లత మాట్లాడుతూ. ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన రాజ్ తాళ్లూకి ధన్యవాదాలు. అలి మాట్లాడుతూ.. వెంకట్తో సీతారామ కళ్యాణం సినిమా నుంచి పరిచయం ఉంది. ఆ సినిమా పెద్ద హిట్ అయ్యింది. అప్పటి నుంచి మా జర్నీ కొనసాగుతోంది. ఆయన నిర్మించిన ఒక సినిమాలో కూడా నేను నటించాను. అన్ని భాషల్లో సినిమాలు చేసిన వెంకట్ ఇప్పుడు 'హారుడు'తో వస్తున్నారు.

## 'రంజీ' ఫస్ట్ లుక్ రిలీజ్



ఆర్యా హీరోగా పోలూరు కృష్ణ దర్శకత్వంలో స్పోర్ట్స్ యాక్షన్ థ్రిల్లర్ రూపొందుతోంది. అక్కృతి నంద సమర్పణలో శ్రీ విజయ వారాహి మూవీస్ బ్యానర్ పై మురుకుంట్ల అరవింద్ విజయ భారతి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఫస్ట్ షెడ్యూల్ షూటింగ్ పూర్తయింది. హీరో ఆర్యా బర్త్డే సందర్భంగా ఈ సినిమా టైటిల్తో పాటు ఫస్ట్ లుక్ను విడుదల చేశారు. ఈ చిత్రానికి'రంజీ' అనే ఆసక్తికరమైన టైటిల్ను ఖరారు చేశారు.ఇంటెన్స్, పవర్ఫుల్ ప్రెజెన్స్తో కనిపించిన ఆర్యా ఫస్ట్ లుక్ ఆకట్టుకుంది. ఆయన ధరించిన క్యాజువల్ కాస్ట్యూమ్ ఈ లుక్కు మరింత రియలిస్టిక్, రిలేటబుల్ వైబ్ తీసుకొచ్చింది. పాత్ర ఎంత ఇంపాక్ట్ఫుల్గా ఉండబోతుందో ఈ ఫస్ట్ లుక్ స్పష్టంగా తెలియజేస్తోంది.ఈ చిత్రంలో వ్రంజనా పాండ్య హీరోయిన్ గా నటిస్తోంది. దశరథ్, వాసుకి, ఆడుకలం నరేన్, సమ్మిట గాంధీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.ఈ చిత్రానికి ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం పని చేస్తోంది. రధన్ మ్యూజిక్ అందిస్తుండగా, రామ్ కె మహేష్ డీవోపీ, నార్ని శ్రీనివాస్ ఆర్ట్ డైరెక్టర్, అనిల్ పసల ఎడిటర్.

# తెర

## 'రేజర్' మే 8న రిలీజ్



తెలుగు సినిమాలో యూనిక్ ఫిల్మ్ మేకర్గా, నటుడిగా ముద్రవేసిన రవిబాబు తన గత చిత్రాల కన్నా భిన్నమైన ఇంటెన్స్ వైలెంట్ ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్ రేజర్తో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ బ్యానర్పై సురేష్ బాబు సమర్పిస్తుండగా, ఫ్లయింగ్ ఫ్రాగ్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం, రవిబాబు తండ్రి దివంగత చలపతిరావు జయంతి సందర్భంగా, మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. టైటిల్ అనౌన్స్మెంట్తోనే మంచి హైప్ తెచ్చుకున్న రేజర్, తాజాగా విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్తో మరింత ఆసక్తి రేపుతోంది. రవిబాబు టెర్రిఫిక్గా కనిపించి థ్రిల్ కలిగించారు.తాజాగా విడుదలైన పోస్టర్లు సినిమాకి ఉన్న డార్క్ టోన్ను మరింత బలంగా చూపిస్తున్నాయి. ఫిబ్రవరిలో షూటింగ్ పూర్తయిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉంది. డబ్బింగ్ పనులు కూడా పూర్తి కాగా, ఫైనల్ ఫినిషింగ్ పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ చిత్రానికి చరణ్ మాధవనేని సినిమాటోగ్రఫీ, ఎస్ఎస్ రాజేష్ సంగీతం, సతీష్ పొలొజు యాక్షన్ కొరియోగ్రఫీ అందిస్తున్నారు. రేజర్ మే 8న థియేటర్లలో ప్రేక్షకులకు విభిన్నమైన థ్రిల్లర్ అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది.

## బంపర్ బ్లాక్ బస్టర్ 'బైకర్'



బైకర్ తెలుగు సినిమా గర్వపడేలా ఉంటుందని చెప్పాము. ఆ మాట నిలబెట్టుకున్నాం. స్టార్శర్వా. చార్మింగ్ స్టార్ శర్వా లేటెస్ట్ బంపర్ బ్లాక్ బస్టర్ బైకర్. మాళవిక నాయర్ హీరోయిన్గా నటించిన ఈ చిత్రంలో రాజశేఖర్ పవర్ ఫుల్ పాత్రని పోషించారు. అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో ప్రతిష్టా త్మక బ్యానర్ గీజు క్రియేషన్స్ నిర్మాణంలో భారతదేశపు మొట్టమొదటి కంప్లీట్ మోటో క్రాస్ డ్రామాగా రూపొందిన ఈ సినిమా ప్రిమియర్స్కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. థాంక్యూ మీట్లో హీరో శర్వా మాట్లాడుతూ.. ముఖ్యంగా మీడియా మిత్రులకు ధన్య వాదాలు. నేను హిట్ కొడితే మీరు హిట్ కొట్టినట్టు ఫీల్ అవుతారు.డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.ఈ సినిమా ఇంత విజయం సాధించడానికి, నా క్యారెక్టర్కు మంచి పేరు రావడానికి కారణం అభిలాష్రెడ్డి. మొత్తం టీమ్కు మంచి పేరు తీసుకొచ్చారు. డైరెక్టర్ అభిలాష్రెడ్డి మాట్లాడుతూ.. ప్రీమియర్స్ నుంచే ఇండస్ట్రీలో ఉన్న ప్రతి ఒక్కరూ ఈ సినిమాను అభినందిం చారు. హీరోయిన్ మాళవిక నాయర్ మాట్లా డుతూ.. ఈ సినిమాకి ఆడియన్స్, మీడియా ఇచ్చిన సపోర్ట్, ప్రేమ మర్చిపోలేం.

## 26న హారిస్ జయరాజ్ మ్యూజిక్ కాన్సర్ట్



హైదరాబాద్లోని సంగీత ప్రియులను ఉర్రూతలూగించేందుకు ప్రముఖ సంగీత దర్శకుడు హారిస్ జయరాజ్ సిద్ధమయ్యారు. ఆయన నేతృత్వంలో జరగనున్న భారీ లైవ్ కాన్సర్ట్ ఏప్రిల్ 26న నగరంలోని బౌల్డర్ హిల్స్ వేదికగా అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకకు సంబంధించిన వివరాలను వెల్లడించేందుకు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హారిస్ జయరాజ్ మరియు సింగర్ కారుణ్య పాల్గొని ఆసక్తికర విశేషాలను పంచుకున్నారు. చాలా కాలం తర్వాత హైదరాబాద్లో షో నిర్వహిస్తుండటంపై స్పందిస్తూ, ఆరెంజ్ సినిమా రీరిలీజ్ సమయంలో తెలుగు ప్రేక్షకులు చూపించిన అపారమైన ప్రేమ, స్పందన చూసి ఆశ్చర్యపోయానని, అదే ఉత్సాహంతో ఈ ప్రత్యేక ప్రదర్శనను ప్లాన్ చేశానని హారిస్ జయరాజ్ తెలిపారు. ముఖ్యంగా ఆరెంజ్, వాసు, మరియు ఘర్షణ వంటి చిత్రాల్లోని ఎవర్గ్రీన్ పాటలు ఈ కాన్సర్ట్లో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని ఆయన హామీ ఇచ్చారు. 13 మంది ప్రముఖ గాయనీగాయకులు ఇందులో పాల్గొంటున్నారు, వీరంతా తాము పాడిన ఒరిజినల్ సాంగ్స్నే వేదికపై ప్రత్యక్షంగా పాడనుండటం విశేషం. ఇంత మంది దిగ్గజ గాయకులను ఒకే వేదికపైకి తీసుకురావడం మరియు వేల పాటల నుంచి కొన్నిటిని ఎంపిక చేయడం సవాలుతో కూడుకున్న పని అని ఆయన పేర్కొన్నారు. ఈ కాన్సర్ట్ టికెట్లు డిస్ట్రిక్ట్ బై జోమాటో యాప్లో అందుబాటులో ఉన్నాయి. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జరుగుతున్న ఈ సంగీత విభావరి నగర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుందని వ్యక్తం చేస్తున్నారు

